క్లుప్తంగా

నేడు నియోజకవర్గ స్థాయి సమావేశం

తిరువూరు: ఈ నెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరువూరు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై చర్చించడానికి శుక్రవారం మధ్యాహ్నం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే రక్షణ నిధి తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు తిరువూరు మండలం లక్ష్మీపురం మనో గార్డెన్స్‌లో జరిగే ఈ సమావేశానికి అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తిరువూరు నగరపంచాయతీ కౌన్సిలర్లు పాల్గొనాలని కోరారు. సీఎం ప్రోగ్రామ్ కన్వీనర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం సమావేశంలో సమీక్షిస్తారని తెలిపారు.

క్షీరబంధు నగదు అందజేత



రెడ్డిగూడెం: కృష్ణామిల్క్ యూనియన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కృష్ణామిల్క్ యూనియన్ బోర్డు డైరెక్టర్ ఉయ్యూరు అంజిరెడ్డి అన్నారు. కొత్తరెడ్డిగూడెం పాలసేకరణ కేంద్రంలో పాల ఉత్పత్తిదారుడైన కొప్పుల రఘుపతిరెడ్డి ఇటీవల మృతి చెందాడు. క్షీరబంధు పథకం కింద మంజూరైన రూ.50 వేల నగదును బోర్డు డైరెక్టర్ అంజిరెడ్డి గురువారం కొప్పుల రఘుపతిరెడ్డి కుమారుడు వెంకట నారాయణరెడ్డికి అందజేశారు.

జిరాక్స్ కం ప్రింటర్ మిషన్ వితరణ




గంపలగూడెం: గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాత జిరాక్స్ కం ప్రింటర్ మిషన్‌ను గురువారం బహుకరించారు. గంపలగూడెంకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు పులిపాటి హనుమంతరావు రూ.15 వేలను ప్రధానోపాధ్యాయుడు ఎస్.జమలయ్యకు అందజేశారు. దాతను ఉపాధ్యాయులు అభినందించారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి



ఆగిరిపల్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్‌ఐ ఎన్.చంటిబాబు తెలిపారు. ఆగిరిపల్లిలోని హైస్కూల్ వద్ద ద్విచక్ర వాహనదారులకు మంగళవారం హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడటం వల్ల ప్రమాదాలు సంభవించినపుడు తలకు గాయం తగలకుండా ప్రాణరక్షణ పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను వినియోగించి తమ ప్రాణాలను రక్షించుకోవాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో భూముల సర్వే



చాట్రాయి: సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయ భూములను ప్రభుత్వం సర్వే చేస్తోందని కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దొశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని చాట్రాయిలో డ్రోన్ సర్వేని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కచ్చితమైన భూ సరిహద్దులు గుర్తించడం ద్వారా ఈ సర్వే దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వనాథరావు, డివిజినల్ సర్వేయర్ వరహాలరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ, దామెర ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

31న నాంబ్ సర్వసభ్య సమావేశం

నూజివీడు: నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, బాపులపాడు మండల పరిషత్ టీచర్స్, ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్(నాంబ్) సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 31వ తేదీ సాయంత్రం సంఘ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి బండపల్లి నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ అధ్యక్షురాలు సూదగాని అరవింద అధ్యక్షతన నిర్వహించే ఈ సర్వసభ్య సమావేశంలో పలు ముఖ్యమైన విషయాలపై చర్చించి తీర్మానం చేస్తామన్నారు.

చురుగ్గా డయాలసిస్ కేంద్రం ఏర్పాటు పనులు

త్వరలో పూర్తి స్థాయిలో సేవలు



ఎ.కొండూరులో కొనసాగుతున్న డయాలసిస్ సెంటర్ నిర్మాణ పనులు

ఎ.కొండూరు: రాష్ట్ర ప్రభుత్వం కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అన్ని రకాలుగా ఆదుకోవాలని ఉద్దేశంతో మెరుగైన వైద్యం అందిస్తూ అండగా నిలుస్తోంది. వారికి అవసరమైన వసతులు కల్పించి ఇబ్బందులకు గురికాకుండా చూస్తోంది. కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న రోగులకు డయాలసిస్ కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే కె.రక్షణనిధి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని దృష్టికి గతంలో తీసుకువెళ్లారు. వెంటనే మంత్రి స్పందించి మండలంలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోగులు ఇబ్బందులు పడకుండా వారికి మెరుగైన వైద్య, ఉచిత వాహన సదుపాయం, ఉచిత మందులు అందించాలని ఆదేశించారు. దూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానిక పీహెచ్‌సీలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే.

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఆయుర్వేద భవనంలో రూ.9 లక్షల వ్యయంతో డయాలసిస్ కేంద్రం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నూజివీడు, తిరువూరు, విజయవాడ దూర ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకోవటానికి ఇబ్బందులు పడుతుండటంతో వారు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఈ వెసులుబాటు కల్పించారు. ఈ మండలంలో ఉన్న డయాలసిస్ రోగులు వారానికి రెండు, మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఈ కేంద్రంలో రోజుకు 10 నుంచి 12 మందికి డయాలసిస్ చేస్తారు. అనంతరం కిడ్నీ రోగులకు నెలకు సరిపడా 37 రకాల మందులను ఉచితంగా అందిస్తున్నారు. కిడ్నీ రోగుల సౌకర్యార్థం ఉచిత వాహనాన్ని కూడా ఏర్పాటు చేశారు.

త్వరితగతిన పనుల పూర్తి..



డయాలసిస్ కేంద్రం పనులు త్వరితగతిన పూర్తి చేయటానికి చర్యలు తీసుకుంటున్నాం. స్థానిక ఎమ్మెల్యే కె.రక్షణ నిధి సహకారంతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరలో పనులు పూర్తి చేసి ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తాం. నాణ్యత ప్రమాణాలతో పనులు చేయిస్తున్నాం.
– సీహెచ్ సాంబశివరావు, పంచాయతీరాజ్ ఏఈ

త్వరలో డయాలసిస్ కేంద్రంలో వైద్యం



డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి వచ్చిన వెంటనే డయాలసిస్ రోగులకు వైద్యం అందిస్తాం. ఇంటి వద్ద నుంచి రోగులకు వాహనంలో తీసుకువచ్చి డయాలసిస్ చేయించి మందులు అందించి మరలా ఇంటికి తీసుకువెళ్లే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం.
– వి.స్వాతి, మండల ప్రాథమిక వైద్యాధికారి

ఆదర్శప్రాయుడు పొట్టి శ్రీరాములు

ఇబ్రహీంపట్నం: తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల పరిధిలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన సేవలను నాయకులు కొనియాడారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల పితామహుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అన్నారు. ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేశారన్నారు. ఆయన పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శమన్నారు. ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, వార్డు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడని కొండపల్లి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఉద్యోగులు, సిబ్బందితో కలిసి నివాళులర్పించారు. ఎన్టీటీపీఎస్‌లో శ్రీరాములు విగ్రహానికి చీఫ్ ఇంజినీర్ ఎస్.అశోక్‌కుమార్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. సీనియర్, జూనియర్ ఇంజినీర్లు పాల్గొన్నారు. కొండపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శ్రీరాములు చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జి.కొండూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని కొత్తూరు తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.కమలాకరావు అన్నారు. జెడ్పీ హైస్కూల్ నందు అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం గ్రంథాలయ ఆవరణ నందు పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. కంభంపాటి వెంకట సత్యనారాయణ, రాజారావు ఉన్నారు

తిరువూరు: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణార్పణ చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి అన్నారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో శ్రీరాములు జయంతి నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి ఎమ్మెల్యే, పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్‌చైర్మన్ రేగళ్ల మోహన్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వార్డు కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, పరసా శ్రీనివాసరావు, మూడు దుర్గారావు, విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన పాలక మండలి సభ్యుడు దేవిశెట్టి బాలకృష్ణ, నడిం తిరువూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ గజ్జల సీతారామారావు, నాయకులు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. తిరువూరు గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ పద్మావతి, పాఠకులు అమరజీవి జయంతి సందర్భంగా నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీలు బాబూరావు, వెంకటరత్నం, నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ కస్తూరిబాయి, కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు, సిబ్బంది పొట్టిశ్రీరాములు జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. వాసవీ క్లబ్, వనిత, యూత్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అమరజీవి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.



ఇబ్రహీంపట్నంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, నాయకులు



తిరువూరులో అమరజీవికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కే రక్షణనిధి, నాయకులు



గంపలగూడెంలో శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఆర్యవైశ్య నాయకులు



నూజివీడులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తోన్న వాసవీ క్లబ్ నాయకులు

ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం

మైలవరం: తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని ఆర్యవైశ్య సంఘం మైలవరం మండల అధ్యక్షుడు బయ్యన శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూజివీడు రోడ్డులో శ్రీరాములు జయంతిని నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి కాజా మహేష్, జూలకంటి ప్రసాద్, చారుగుండ్ల ప్రసాద్, జూలూరు రమేష్, చామర్తి కృష్ణమూర్తి, వార్డు సభ్యుడు జూలూరు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అమరజీవి సేవలు మరువలేనివి

గంపలగూడెం: అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. గంపలగూడెం గాంధీ సెంటర్‌ల్లో ఆర్యవైశ్య మండల సంఘం ఆధ్వర్యంలో శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పలువురు ఆర్యవైశ్య ప్రతినిధులు, వ్యాపార సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వచ్చే ఏడాది జయంతి నాటికి గంపలగూడెం గాంధీ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు నాళ్ళా చిన్న సత్యంబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరసింహారావు, కేతేపల్లి సత్యంబాబు, ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాకుళపు శివకుమార్, వర్తక సంఘం అధ్యక్షుడు చారుగుండ్ల సుబ్బారావు, వివిధ విభాగాల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి నివాళులర్పించారు. ఊటుకూరులో వాసవీ, వనిత క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అమరజీవి జయంతి నిర్వహించారు. ప్రతినిధులు కాజా నాగేంద్రరావు, కాజా శ్రీనివాసరావు, ఎస్.శేషగిరి, శ్రీరమ్య పాల్గొన్నారు.

విస్సన్నపేట: ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీపీ, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి నివాళులర్పించారు. ఉప సర్పంచ్ మండపాటి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, పిల్లి రాజేష్, కోటేశ్వరరావు, ఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శ్రీరాములు చిత్రపటానికి ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. కొండపర్వ ఎంపీయూపీ పాఠశాలలో అమరజీవి జయంతి వేడుకలను నిర్వహించారు

నూజివీడు: తెలుగు వారి కోసం ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే డిమాండ్‌తో రాష్ట్రసాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం చిరస్మరణీయమని వాసవీ క్లబ్ నూజివీడు పట్టణ అధ్యక్షుడు బంధం శివనాగరాజు అన్నారు. పొట్టిశ్రీరాములు జయంతిని గురువారం పట్టణంలో నిర్వహించారు. శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాసవీక్లబ్ కార్యదర్శి చలువాది రామకృష్ణ, కోశాధికారి చిట్లూరి కిషోర్, ప్రాంతీయ సెక్రటరీ ఆర్ఎస్ సుష్మన్, నాయకులు చిన్నం శ్రీనివాసరావు, మానేపల్లి సతీష్, తటవర్తి కుమార్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు దోసపాటి రాము పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విశ్వనాథరావు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ రాంబాబు, జూనియర్ అసిస్టెంట్ పిరంగి నవ్య పాల్గొన్నారు. చనుబండలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీరాములు జయంతిని నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్‌లోని 10వ తరగతి విద్యార్థులకు స్కేళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు చిట్లూరి నాగేశ్వరరావు, కార్యదర్శి జయశ్రీ, కోశాధికారి చవ్వా నారాయణ, వర్తక సంఘం అధ్యక్షుడు నడిపల్లి కిషోర్ పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం: సమాజంలో టీబీ వ్యాధిగ్రస్తులను మానవతా దృక్పథంతో దత్తత తీసుకుని పౌష్టికాహారం అందించాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఉషారాణి కోరారు. ప్రధానమంత్రి టీబీ ముక్తిభారత్ అభియాన్‌లో భాగంగా దాతల సహకారంతో ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పౌష్టికాహారం కిట్లు క్షయ వ్యాధిగ్రస్తులకు గురువారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్టీఆర్ జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. టీబీ వ్యాధి సంక్రమించే పద్ధతులు, రోగి లక్షణాలు, నివారణ మార్గాలు వివరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. పీహెచ్‌సీ డాక్టర్ సుధాప్రసూజ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో పౌష్టికాహారం అందజేస్తున్న ఉషారాణి తదితరులు

ప్రజలు మాస్కులు ధరించాలి

ఆగిరిపల్లి: ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జె.జగన్‌మోహనరావు సూచించారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ఓ గర్భిణికి కరోనా సోకిందన్నారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో భౌతిక దూరం పాటిస్తూ మాస్కులు ధరించాలని తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నూజివీడు: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటేనే భవిష్యత్ బాగుంటుందని నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ బి.రవి తెలిపారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిమాణాలపై స్క్రీన్, ప్రాజెక్టర్ ద్వారా విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం రోజురోజుకు పెరుగుతోందని, దీని వల్ల దేశానికి ఎంతో ఉపయోగపడాల్సిన యువశక్తి నిర్వీర్యమైపోతోందన్నారు. దీని నుంచి బయటకు తీసుకురావడానికి నవజీవన్ బాల భవన్ సంస్థ నూజివీడులో బోస్కో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందన్నారు. హైస్కూల్ హెచ్ఎం భాగవతుల హేమలత మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని వాటికి దూరంగా ఉండాలన్నారు. నవజీవన్ బాలభవన్ జోనల్ పాఠశాల ఉపాధ్యాయులు వి.వనజ, మహిళా సంరక్షణ కార్యదర్శి పి.శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

గంపలగూడెం: గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు అవసరమైన స్టేషనరీని సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. పాఠశాలలో 106 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్ను, పెన్సిల్, పౌచ్‌లు, ఎరైజర్లను సభ్యులు సుబ్రహ్మణ్యం, చక్రధర్ అందజేశారు. హెచ్ఎం ఎస్.జమలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీలు చెత్త నుంచి సంపద సృష్టించాలి

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): గ్రామ పంచాయతీలు చెత్త నుంచి సంపద సృష్టించాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి జె.సునీత ఆదేశించారు. మండలంలోని కేతనకొండ చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో సేకరిస్తున్న తడి, పొడి చెత్త సేకరణ తెలుసుకున్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా సేకరించిన ఇంటింటి చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారుచేసి రైతులకు విక్రయించాలన్నారు. అనంతరం గ్రామంలో పని చేస్తున్న ఉపాధి హామీ పనులు పరిశీలించారు. కూలీల మస్టర్ తనిఖీ చేశారు. అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ పాల్గొన్నారు.



కేతనకొండలో వర్మి కంపోస్ట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ సునీత, ఎంపీడీఓ రామకృష్ణ

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

నూజివీడు: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారద జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమైంది. తెలుగు, హిందీ, సంస్కృతం సబ్జెక్టులకు సంబంధించి పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు నాలుగు కేంద్రాల్లో 1,309 మంది విద్యార్థులకు 1,270 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 39 మంది గైర్హాజరయ్యారు. మంచినీరు, బెంచీలతో పాటు అన్ని వసతులు కల్పించారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యచికిత్స అందించేందుకు ప్రతి కేంద్రం వద్ద ఏఎన్ఎంలను నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

40 మంది గైర్హాజరు

తిరువూరు: మూడు పరీక్ష కేంద్రాల్లో 927 మంది అభ్యర్థులకు 887 మంది హాజరయ్యారు. 40 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 314 మందికి 294 మంది, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల పరీక్షా కేంద్రంలో 360 మందికి 347 మంది, నాగార్జున కాలేజీ కేంద్రంలో 253 మందికి 246 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

54 మంది గైర్హాజరు

విస్సన్నపేట: 1,548 మందికి 1,494 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 54 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీకేఎన్‌పీ(సిద్ధార్థ)కళాశాల, వికాస్, శ్రీశ్రీ కళాశాలల్లో విద్యార్థులకు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

16 మంది గైర్హాజరు

తోటమూల(గంపలగూడెం): గంపలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో గురువారం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 308 మంది విద్యార్థులకు 292 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కిలారు హనుమంత ప్రసాద్, డిపార్ట్‌మెంటల్ అధికారి యోగానందరావు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఆగిరిపల్లి: స్థానిక గన్నవరం రోడ్డులోని ఎంవీఎస్, వైవీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. 83 మంది విద్యార్థులకు 82 మంది హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ అరుణశ్రీ తెలిపారు.



నూజివీడులో పరీక్ష గదులు చూసుకుంటున్న విద్యార్థినులు

నైపుణ్యాలను వెలికి తీసేందుకే టాలెంట్ టెస్ట్

మైలవరం: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, తద్వారా ఉద్యోగావకాశాలను సులువుగా దక్కించుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐ యామ్ నియో ఆధ్వర్యంలో బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఏడాదిగా కళాశాల అధ్యాపకులచే ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దీనిలో భాగంగా విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీయడానికి ప్రోగ్రామింగ్‌లో టాలెంట్ టెస్ట్‌ను గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో సీహెచ్ సుస్మిత, ఐటీ ప్రథమ స్థానం, డి.మనోజ్ నాగసాయి కుమార్, సీఎస్ఈ ద్వితీయ స్థానం, టి.వెంకట మణికంఠ రాకేష్, సీఎస్ఈ తృతీయ స్థానంలో విజయం సాధించారు. కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఐ యామ్ నియో ప్రతినిధులు, టెక్నికల్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ వై.విజయ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్ అప్పారావు, విభాగాధిపతులు, అధ్యాపకులు

నష్టపరిహారం 10 శాతం పెంచాలని విజ్ఞప్తి

జక్కంపూడి(విజయవాడరూరల్): ఆర్ఓఆర్ ఫ్లై ఓవర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు 10 శాతం పెంచి నష్టపరిహారం ఇవ్వాలని రైతులు విజ్ఞప్తి చేశారు. జక్కంపూడి గ్రామ సచివాలయ కార్యాలయంలో మండల తహసీల్దార్ పి.జాహ్నవి రైతులతో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఆర్ఓఆర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి భూ సేకరణ ద్వారా 87 సెంట్ల భూమి సేకరించామన్నారు. రైలు ఓవర్ రైలు బాధితులకు ఇచ్చిన పరిహారం కంటే అదనంగా 10 శాతం చెల్లించాలని రైతులు కోరారు. దీనిపై రాత పూర్వకంగా తెలియచేస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ తెలిపారు. సమావేశంలో ఆర్ఐ రామ్‌సింగ్, వీఆర్వో శివయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.



జక్కంపూడి గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ జాహ్నవి

వృత్తి నైపుణ్యంతో ఉజ్వల భవిష్యత్

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): విద్యార్థులకు వృత్తి నైపుణ్యం ద్వారా ఉజ్వల భవిష్యత్ కలుగుతుందని ఆర్కే కళాశాల చైర్మన్ ఎంఎం కొండయ్య, కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజశేఖర్ అన్నారు. కేతనకొండ ఆర్కే కళాశాలలో గురువారం జరిగిన టెక్ ఫెస్ట్ డివిట్ 2కే23 సదస్సులో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ కంప్యూటింగ్ మిషనరీ స్టూడెంట్ చాప్టర్‌ను వారు ప్రారంభించారు. ఇలాంటి అంతర్జాతీయ చాప్టర్ ద్వారా విద్యార్థులు అంతర్జాతీయంగా జరిగే ఇన్నోవేషన్స్ తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు ఆవిష్కరణలు ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చాప్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎం కొండయ్య, రాజశేఖర్ తదితరులు